www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 ఆగస్టు 2024



బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల సిపిఎం అన్నమయ్య జిల్లా కమిటీ సంతాపం తెలియజేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ అత్యుత్తమ కమ్యూనిస్టు నాయకుడు, పొలిట్‌బ్యూరో మాజీ సభ్యుడు, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య శుక్రవారం ఉదయం 8.20 గంటలకు మృతిచెందారన్నారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, ఆదర్శాలు, ఆయన ముందు చూపు ఎల్లప్పుడూ సిపిఎం కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. 2000 నుంచి 2011 వరకు వరుసగా 11 సంవత్సరాలు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా ఆయన సేవలందించారని తెలిపారు. బల్లిగంజ్ ప్రాంతంలోని రెండు చిన్న గదుల ప్రభుత్వ అపార్ట్‌మెంట్‌లో నివసించారని, పశ్చిమ బెంగాల్ పారిశ్రామికీకరణపై ఆయన గట్టి వైఖరిని తీసుకున్నారని వివరించారు. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసినా సాధారణ జీవితం గడిపారని కొనియాడారు. బుద్ధదేవ్ మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు లోటన్నారు. మతోన్మాదంపై పోరాటం చేస్తూ దేశాన్ని సోషలిజం వైపుకు నడిపేందుకు చేసే పోరాటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

ఇరిగేషన్‌కు రూ.2,130 కోట్లు

- బిల్లుల చెల్లింపులకు రూ.830 కోట్లు
- పిబిసికి రూ.330 కోట్లు
- తెలుగుగంగకు రూ.6 కోట్లు
- 'అన్నమయ్య'కు ఎగనామం



అరకొర నిధులు కేటాయించిన బ్రహ్మసాగర్ రిజర్వాయర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రభుత్వం ఇటీవలి ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌లో జిల్లా నీటి పారుదల శాఖ విభాగానికి రూ.2,130 కోట్లు కేటాయించింది. ఉమ్మడి కడప జిల్లాలోని 14 ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేసింది. రూ.1300 కోట్లు ప్రాజెక్టు పనులకు, రూ.830 కోట్లు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు పద్దును కేటాయించింది. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ముంగిట జిల్లా నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన రూ.2,130 కోట్ల పద్దును యథాతథంగా ఆమోదించడం పట్ల ఇంజినీరింగ్ అధికారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం జిల్లాలో గతంలో చేసిన అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లుల ప్రతిపాదనల తరహాలో మిగిలిన జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించక పోవడమే యథాతథ ఆమోదానికి కారణమనే వాదన వినిపిస్తోంది. అత్యధికంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పిబిసి)కు రూ.330 కోట్లు కేటాయించింది. రూ.200 కోట్లు ప్రాజెక్టు పనులకు, మిగిలిన రూ.130 కోట్లను ఇంజినీరింగ్ యంత్రాంగం జీతభత్యాలకు వ్యయం చేయనుంది. గండికోట నిర్వాసితుల పరిహారం చెల్లింపులకు రూ.78 కోట్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన తెలుగుగంగ ప్రాజెక్టు రూ.430 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ రిజర్వాయర్ అభివృద్ధి పనులకు రూ.ఆరు కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. కడప జిల్లాలోని బుగ్గవంక, అన్నమయ్య జిల్లాకు చెందిన ప్రధాన రిజర్వాయర్లుగా పరిగణ పొందిన అన్నమయ్య రిజర్వాయర్ ఇన్వెస్టిగేషన్ బిల్లు చెల్లింపులకు రూ.78 లక్షలు, వెలిగల్లు, రూ.100 కోట్ల వ్యయంతో కూడిన ఎత్తిపోతల పనులకు ఎటువంటి కేటాయింపులు చేలేదు.



నిధుల కేటాయింపునకు నోచని అన్నమయ్య ప్రాజెక్టు

గిరిజనం..అభివృద్ధికి ఆమడ దూరం

- పూరి గుడిసెలే వారి ఆవాసాలు
- ఆధార్, రేషన్‌కార్డులు లేక సంక్షేమ పథకాలూ దూరం
- గ్రామాల వైపు కన్నెత్తి చూడని అధికారులు
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి-రాయచోటి

మారుమూల పల్లెల్లో నివసించే గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా విఫలం అవుతూనే ఉన్నాయి. దీని వల్ల వారి అభివృద్ధి కుంటుపడుతోంది. 77 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజనులు ఉన్నారు. గిరిజనుల్లో ఒక తెగగా చెప్పుకునే యానాదులు ఏ ఒక్క ప్రభుత్వ పథకాలు అందుకోలేని అనాథలుగా మిగిలిపోవడం శోచనీయం. గుట్ట, పుట్ట పట్టుకుని పూట గడుపుతున్న యానాదుల ధీనగాథ అంతా ఇంతా కాదు. జిల్లాలో సుమారు 75 యానాదులు కాలనీలున్నాయి. సుమారు లక్షకు పైగా జనాభా ఉన్నారు. ఆధార్ లేక కొందరు, రేషన్ లేక మరి కొందరు, ఒకవేళ రైతన్న ఆధార్ ఉన్న ఇకెవైసి, ఫోన్ నెంబర్ లింక్ వసతులు లేక, ప్రభుత్వ పథకాలు పక్కా గృహాలు, వృద్ధాప్య పింఛన్, తల్లికి వందనం, ఫీజు రియంబర్స్మెంట్‌కు వారు దూరమవుతున్నారు. కనీసం వారికి రావాల్సిన ప్రభుత్వ పథకాలు కూడా అందడం లేదు. యానాదులపై జిల్లాలో అధికారులు నిర్లక్ష్యం ఎక్కువ శాతం కనబడుతోంది.

జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలు, పుల్లంపేట, ఓబులవారిపల్లి, రాయచోటి, గాలివీడు, రామాపురం మండలాల్లో యానాదుల కాలనీలున్నాయి. వారిని అభివృద్ధి చేసేందుకు నెల్లూరు జిల్లాలో ఐటిడిఎ ఆఫీసు ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్నటువంటి ప్రాజెక్టు అధికారి ఇంత వరకూ యానాది కాలనీలవైపు కన్నెత్తి కూడా చూడక పోవడం శోచనీయం. కనీసం యానాదులు సమస్యలు పరిష్కరించడానికి మొగ్గు చూపడం లేదు. యానాదులు వెనుక బడిబాట కారణం ఐటిడిఎ అధికారులే. ఇప్పటికైనా స్పందించి యానాదులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా ఉన్నతాదికారులు ధర్యలు తీసుకోవాలని జిల్లాలోని పలువురు యానాదులు కోరుతున్నారు. ఆధార్ కార్డుల కోసం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నివేదికలు పంపినా నెల్లూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి చీమ కుటినట్లు కూడా లేదని పలువురు యానాదులు వాపోతున్నారు. యానాదులు కోసం ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని యానాది సంక్షేమ సంఘం వినతి పత్రం సమర్పించినా ప్రాజెక్టు అధికారి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని యానాది సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డు లేక తమ పిల్లలను స్కూళ్లల్లో కూడా చేర్పించలేని. పరిస్థితి నెలకొందిని, దీని వల్ల దీనివలన పిల్లలకు రావాల్సిన తల్లికి వందనం. ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్లో సీట్లు వంటివి కోల్పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



పూరిగుడిసెలే గిరిజనుల ఆవాసాలు

అధికారులు స్పందించాలి



యానాదులు ఎక్కువగా ఉన్న రైల్వేకోడూరులో ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి. జిల్లాలో ఉన్నటువంటి యానాది కాలనీ గడప గడపకూ ప్రభుత్వ అధికా రులు తిరిగి వారికి కావాల్సిన ఆధార్, రేషన్, ఫోన్ లింక్ ఇతర మౌలిక వసతులను కల్పించాలి. ఐటిడిఎ నిధులు యానాది కాలనీల అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి. ఇప్పటికైనా ప్రజాప్ర తినిధులు, అధికారులు, ఐటిడిఎ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

- జి.శివయ్య, జిల్లా అధ్యక్షులు, యానాదులు సంక్షేమ సంఘం. అన్నమయ్య జిల్లా

ఆందోళన అవసరం లేదు



జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీలో సచివాలయం, మండలం ఎంపిడిఒ కార్యాలయాలలో ఆధార్ లాగిన్ ఓపెన్ అవుతుంది. ఎవరైనా విద్యార్థులు ఆధార్, రేషన్ కార్డ్ లేని వారు అక్కడికి వెళ్లి పరిశీలించుకోవచ్చు. లేనివారికి ఆధార్ కార్డు రేషన్ కార్డు అక్కడే వారు అందజేస్తారు. లేనియెడల తమ కార్యాలయానికి ఎవరైనా వచ్చిన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారికి కావాల్సిన ఆధార్, రేషన్ కార్డును ఏర్పాటు చేస్తాం.

- పి.తేజస్విని, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, అన్నమయ్య జిల్లా.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- రాయచోటి

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం అయ్యేలా సంబంధితాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పథకంపై సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ శాఖ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 78,221 ఇళ్లు కేటాయించారన్నారు. వీటిల్లో 82 శాతం గ్రౌండింగ్ అయ్యాయని, మిగతా వాటిని త్వరగా పూర్తిచేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా, మదనపల్లిలో మాత్రమే కొంత మెరుగ్గా 46 శాతం పూర్తయ్యాయని, మిగతా నియోజకవర్గాలలో త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇదివరకే ఈ పథకం కింద రిజిస్టర్ అయిన లబ్ధిదారులు కొత్త పథకంలోకి మారడానికి వీలు లేదన్నారు. జియో ట్యాగ్ చేయబడని 893 ఇళ్లను త్వరగా జియో ట్యాగ్ చేయాలని ఆదేశించారు. సంయుక్త కలెక్టర్, రాజంపేట , మదనపల్లి సబ్ కలెక్టర్లు, రాయచోటి ఆర్‌డిఒ వారంలో కనీసం మూడుసార్లు ఇళ్ల నిర్మాణం పై సమీక్షించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి , రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, నైదియాదేవి, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపిడిఒలు, హౌసింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు పాల్గొన్నారు.

'ఓపెన్' నమోదు శాతం పెంచండి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు, చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు, కార్మికులు వివిధ సంఘాల సభ్యులు తదితరుల సౌకర్యార్థం ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా కల్పించిన ఓపెన్ స్కూల్స్‌లో నమోదు శాతాన్ని పెంచాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీధర్, ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజుతో కలిసి ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో నిరక్షరాస్యతను నిర్మూలించాలన్నారు. వివిధ కారణాల చేత పాఠశాలను మధ్యలో మానేసిన, పదవ తరగతి ఫెయిల్ అయిన 14 సంవత్సరాలు నిండిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన మధ్యలో కళాశాల మానేసిన 15 సంవత్సరాల నిండిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ పరీక్ష రాసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కావున ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్‌తో పాటు ఇతర అధికారులు, విద్యాశాఖ అధికారులు ఓపెన్ స్కూల్స్‌లో నమోదు శాతాన్ని పెంచడమే కాకుండా అన్నమయ్య జిల్లాను నిరక్షరాస్యత రహిత జిల్లాగా తయారు చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి కొండయ్య నాయుడు

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లి

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు తల్లిదండ్రుల ఆశలు మీ ఆశయాలు నెరవేరాలంటే క్రమశిక్షణ కలిగిన జీవితమే మీకు బంగారు భవిష్యత్తునిస్తుందని డిఎస్‌పి వి.కొండయ్య నాయుడు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో యువత మేలుకో భవిష్యత్తును మలుచుకో, డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా యువత క్రమశిక్షణతో దురలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మీ ద్వారా సమాజంలో ఉన్న దురలవాట్లు కలిగిన వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు మీమీద పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయవద్దని క్రమశిక్షణ కలిగిన యువతే భవిష్యత్తులో ఎక్కడ ఉన్నావు ఉన్నత స్థాయిలో రాణిస్తారని ఆయన తెలియజేశారు. టూ టౌన్ సిఐ యువరాజు మారక ద్రవ్యాల వినియోగం పట్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. సమావేశంలో ప్రిన్సిపల్ రమాదేవి, టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ డిజి రామమూర్తి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కార్మికులకు జీతాల చెల్లించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జీతాలు చెల్లించాలంటూ గురువారం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో పనిచేసే కార్మికులు ఎఐటియుసి కార్మిక నేత జి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు వచ్చే జీతాలపైనే కుటుంబాలు గడుస్తున్నాయన్నారు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఏమి కొనాలన్నా మండిపోతున్న ధరలతో కార్మిక కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌ఎంఒ ప్రసాద్ రాజుకు వినతి పత్రం ఇచ్చి విధుల్లోకి వెళ్లారు. కార్యక్రమంలో ఆస్పత్రిలో పనిచేస్తున్న 32 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



జీతాల కోసం ధర్నా చేస్తున్న కార్మికులు

జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సెప్టెంబర్ నెల 1, 2, 3వ తేదీలలో విశాఖపట్నంలో జరుగనున్న ఎఐటియుసి జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, పట్టణ కార్యదర్శి తిరుమల పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో జాతీయ సమితి సమ్మేళనం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమ్మేళనాలలో కార్మిక వర్గ సమస్యలపై చర్చించి, సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికులు, ప్రభుత్వ స్కీమ్ ఉద్యోగులను కట్టుబానిసలుగా మార్చి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. టిడిపి నాయకులు కొన్ని ప్రాంతాలలో అంగన్వాడీ, ఆశా, మిడ్డేమీల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల పట్ల వేదింపులకు పాల్పడుతున్నారని, రాజీనామా చేసి వెళ్ళండంటూ వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు హరి, ఎఐటియుసి జిల్లా నాయకులు దేవా, మదనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డెప్ప, మదనపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు వాసు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మురళి, రవి, నాగరాజు, రామకృష్ణ, మల్లి, చిన్న రెడ్డెప్ప పాల్గొన్నారు.

స్కూల్ కమిటీ ఎన్నికలను రద్దు చేయాలి

ప్రజాశక్తి -రాయచోటి

పట్టణంలోని కె.రామాపురంలో గురువారం నిర్వహించిన కమిటీ చైర్మన్ ఎన్నికలను రద్దు చేయాలని హ్యూమన్ రైట్స్ స్టూడెంట్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టిపల్లి సాయికుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె. రామాపురం స్కూల్ కమిటీ చైర్మన్‌లు సమయానికి ముందు బయట వ్యక్తులు చొరవతో ఎన్నుకున్నారు న్నారు. బయట వ్యక్తులు స్కూల్ కమిటీ ఎన్నికలకు రాకూడదని నిబంధనలో ఉన్నా, వారిని అనుమతించి ఎన్నికల నిర్వహించిన హెడ్మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఎన్నుకున్న కమిటీని రద్దుచేసి నూతన చైర్మన్ వర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ నాయకులు ఉపేంద్ర, అంజి,శివతేజ పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



రక్తదానం చేస్తున్న విద్యార్థి

రక్తదానం మరొకరికి ప్రాణదానమని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తెలిపారు. గురువారం అన్నమాచార్య యూనివర్సిటీలో గురువారం సెంట్రల్ ట్యాక్స్ డిపార్టుమెంట్, ఎన్‌సిసి, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ ట్యాక్స్ వై.వెంకటేష్, ఐఆర్‌ఎస్, బి.శ్యామసుందర్ రాజు, ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ జి.మణికంఠ, రెడ్ క్రాస్ సొసైటీ నుంచి జి.శివశంకర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.కె.అన్సార్‌బాషా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విద్యార్థులు పాల్గొని 102 యూనిట్లు రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందించడం వలన ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తాన్ని అందించి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని తెలిపారు. ఇటువంటి మహత్తరమైన కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్ని రక్తదానం చేయడం గొప్ప గర్వకారణంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని, యువతీ, యువకులు రక్తాన్ని ఇవ్వడం వలన ఎటువంటి అనారోగ్యానికి గురికారని పేర్కొన్నారు. యువతీ, యువకులు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎల్.ఓబులపతి, పిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, ఎన్‌ఎస్‌ఎస్ కేర్ టేక్ అధికారి ఎన్.దీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

విద్యార్థులకు ఇంటర్వ్యూలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి, ట్రాన్స్‌ఫర్మేషన్ కోచ్, ఎజైల్ మాస్టర్, సొసైటీ జనరల్ రవీంద్రనాథ్ సవాలి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఇంటర్వ్యూను ఎలా ఎదురుకోవాలనేది గొప్ప ఛాలెంజ్‌గా ఉందన్నారు. ప్రతి ఇంటర్వ్యూలో కూడా విద్యార్థికి ముఖ్యం తన రెస్యూమేనని తెలిపారు. ప్రతి ఒక్క ఉద్యోగ అవకాశం, కంపెనీల గురుంచి సోషల్ మీడియా అయిన లింక్‌డిన్‌లో పొందుపరచడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి తమ ప్రొఫైల్ ద్వారా లింక్డ్‌ఇన్ అకౌంట్‌లో ఖాతాను సృష్టించండి చాలా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్క కంపెనీ వారు లింక్డ్‌ఇన్‌లో గల విద్యార్థుల ప్రొఫైల్‌ను చూస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఇది చాలా అవసరమన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూల్లో సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ పెంపొందిన్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ముక్యంగా తమ లక్ష్యాన్ని ఎలా కనుగొనాలి, ప్రీ-ఇంటర్వ్యూ ప్రిపరేషన్, ఇంటర్వ్యూలకు హాజరయ్యే సాంప్రదాయ పద్ధతి, ఇంటర్వ్యూను ఛేదించడానికి ఆధునిక పద్ధతి, మీరు పని చేయబోయే సంస్థ గురించి జ్ఞానాన్ని పెంచుకోవడం వంటివి చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ,వి.పవన్ కుమార్, విభాగాధిపతి, వెంకటేష్, సహాయ ఆచార్యులు, ఇఇఇ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన సబ్ కలెక్టర్ వైఖోమ్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడును గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రాజంపేట సబ్ కలెకర్టర్ వైఖోమ్ నిదియాదేవి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించుకున్నారు.



ఎస్‌పికి పూల మొక్కను ఇస్తున్న సబ్ కలెక్టర్

సాయి కళాశాలలో స్టూడెంట్స్ క్లబ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం స్టూడెంట్స్‌క్లబ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్లేస్మెంట్ ప్రాంగణంలో అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన పోడియం, మానిటర్ స్క్రీన్‌పై కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ స్టూడెంట్ క్లబ్ కోఆర్డినేటర్ కరుణాకర్, స్టూడెంట్స్ క్లబ్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు వివిధ సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రవేశం విద్యార్థుల అభ్యున్నతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కళాశాలలో డాన్స్, మ్యూజిక్, ఎంటర్‌ప్రెన్యూర్షిప్ కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై స్టూడెంట్స్ క్లబ్స్ ప్రారంభిస్తున్నామని వివరించారు. ఈ స్టూడెంట్స్ క్లబ్ ప్రవేశం వల్ల వివిధ కళాశాలల విద్యార్థుల పరిచయం, వివిధ రంగాల వ్యక్తులతో స్నేహం, మానసిక ఒత్తిడి నుండి స్వాంతన, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవడం వంటి వివిధ అంశాలలో స్టూడెంట్స్ క్లబ్ పాత్ర ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు స్టూడెంట్స్ క్లబ్ సభ్యుడుగా చేరడం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్



పరిశుభ్రంగా తయారైన వెలిగల్లు వీధులు

క్లీన్ గ్రామ పంచాయతీగా వెలిగల్లు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని వెలిగల్లు పంచాయతీ పరిధిలోని వీధులలో ప్రధాన రహదారి పైన ఉన్న పేడ దిబ్బలు, కంప చెట్లు, వ్యర్థాలు లేకుండా గ్రామంలోని 13 వీధులలో చక్కగా శుభ్రం చేశారు. ఇలా ఈరోజే కాకుండా ప్రతిరోజు పరిసరాలు శుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యంగా ఉండగలుగుతారని అధికారులు తెలిపారు. ప్రభుత్వం కూడా పర్యావరణం, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టిందని అన్నారు. గ్రామాలలో ఎక్కడ కూడా అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇఒపిఆర్‌డి శేకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సరోజ, గ్రామ సర్పంచ్ నఫీస్ ఆధ్వర్యంలో జెసిబి యంత్రాన్ని ఉపయోగించి ఉన్న ముళ్ల కంపచెట్లు, చెత్తాచెదారాలను తొలగింపజేశారు.



పనులు పరిశీలిస్తున్న డిఇ వెంకటసుబ్బయ్య

కల్వర్టును పరిశీలించిన ఆర్అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని పుల్లగూర గండి సమీపంలోని మాండవ్య నదిపై జరుగుతున్న కల్వర్టు పనులను ఆర్అండ్‌బి అధికారులు డిఇ వెంకటసుబ్బయ్య, ఎఇ మహమ్మద్ యూసుఫ్‌లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యత ను పరిశీలించారు. పనుల్లో నాణ్యత జరుగుతున్న కల్వర్టు పనులను ప్రతిరోజూ అధికారులచే పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. నిబంధనల మేరకు పనులు ఉంటేనే గుత్తేదారుకు బిల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్, గుత్తేదారు పాల్గొన్నారు.



బస్టాండు ఆవరణంలో సంచరిస్తున్న కుక్కలు

కుక్కలతో బెంబేలెత్తుతున్న జనాలు

ప్రజాశక్తి-కలకడ

కుక్కలతో జనాలు మండలంలో బెంబేలెత్తుతున్నారు. మండల కేంద్రమైన కలకడలోని బస్టాండు, పోలీస్ స్టేషన్ సమీపంలో ఊర కుక్కలు స్వైర విహారం చేస్తూ జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. బస్టాండ్ ఆవరణంలో ఎలప్పుడూ ప్రయాణికులు, పాదచారులు, చిన్న పిల్లలు తిరుగుతున్న తరుణంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండంతో ఎప్పుడు దాడి చేస్తాయోనన్న భయంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టు కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో చిన్నారులు, పెద్దలు, కుక్కలకు భయపడక తప్ప డం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిందు, తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో బిందు, తుంపర సేద్య పరికరాల కోసం రైతులు నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఉద్యానశాఖ విస్తరణ అధికారి వీరారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అవసరమైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏడు సంవత్సరాలు క్రితం డ్రిప్ తీసుకున్న రైతులు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలలను మూసేయాలనుకోవడం దుర్మార్గం

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థుల సంఖ్య తగ్గిందనే సాకుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసేయాలని ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటి నొప్పికి తుంటిమీద తన్నినట్లుంది రాష్ట్రంలోని టిడిపి కూటమి పాలన అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూంటే.. దాన్ని పట్టించుకోకుండా మూసేయాలని ఆలోచించడం శోచనీయం అన్నారు. 2022 జూన్ 10న వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 117 ప్రాథమిక విద్య ఉసురు తీసిందని తెలిపారు. ఆ జిఒ ప్రకారం 3,4,5 తరగతులను ప్రాథమిక విద్య నుండి విడగొట్టి సమీపంలో ఉండే ప్రాథమికోన్నత లేదా ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారన్నారు. పాఠశాలల మూసే నిర్ణయం విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిఒ 117ను రద్దు చేయడంతోపాటు 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భాస్కర్ కుటుంబానికి వికసిత ఫౌండేషన్ వారు ఆర్థిక సహాయం చేశారు. మండలంలోని తూపల్లె గ్రామానికి చెందిన భాస్కర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స అనంతరం ఇంటి వద్దనున్న భాస్కర్‌కు గురువారం వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి రూ.6 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సేవా సంస్థ ద్వారా వివిధ సేవలను అందిస్తున్నామన్నారు. ఎవరైనా నిస్సహాయత స్థితిలో ఉంటే వికసిత ఫౌండేషన్ దృష్టికి తేవాలని కోరారు. మానవసేవే మాధవసేవగా భావించి సమాజాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. దాతలు ముందుకు వచ్చి సమాజంలోని నిస్సహాయత స్థితిలో ఉన్న వారికి అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఫౌండేషన్ సభ్యులు ధనుంజయ, విజయ్, సుబ్బయ్య పాల్గొన్నారు.

'ఎన్ఎంఇఒ-ఒపి' ద్వారా రైతులకు ప్రోత్సాహం

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : రేగులపల్లిలో ఉద్యానశాఖ, వైఎస్ఆర్ జిల్లా సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలో నూతన పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సువెన్ ఆగ్రో కంపనీ ప్రతినిధి కొండారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బి.మఠం, మైదు కూరు, ప్రొద్దుటూరు, శ్రీ అవదూత కాసినాయన, పులివెందుల మండలాల్లో ఉద్యాన పంటగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఉద్యానశాఖ అధికారి ఎన్ఎం ఈఓ-ఓపీ పథకం ద్వారా ఈ పంట సాగుకు కేంద్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఉద్యాన శాఖాధికారి జయభరత్‌రెడ్డి, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ జిఎం పిఎం కొండారెడ్డి, వ్యవసాయ, ఉద్యాన గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

సజావుగా స్కూల్ కమిటీ ఎన్నికలు



కలకడ :కోన జడ్‌పి హైస్కూల్లో కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కమిటీ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు చంగల్ రాయుడు తెలిపారు.కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా హరిత, వైస్ చైర్మన్‌గా యాలపల్లి వెంకటరమణ ఎన్నికయ్యారు.కార్యక్రమంలో తల్లిదండ్రులు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు శివారెడ్డి, మహేశ్వ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.**ఆదర్శపాఠశాల ఎన్నిక వాయిదా..** మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో జరగవలసిన పాఠశాల కమిటీ ఎన్నికలు వాయిదా పడినట్లు ప్రిన్సిపల్ మలంషావలి తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉన్న ఆరవ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికలకు హాజరు కావలసి ఉంది. గురువారం నిర్వహించిన పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నికలలో ఆరు, ఏడు తరగ తులకు చెందిన విద్యార్థులు తల్లిదండ్రులు కోరం ప్రకారం హాజరు కాగా వారికి ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. 8,9,10 తరగతిలో విద్యార్థుల తల్లిదండ్రులు తక్కువ సంఖ్యలో రావడంతో కోరం ప్రకారం సగానికి పైన తల్లిదండ్రులు రావాల్సి ఉంది. కోరం సభ్యులు రాకపోవడంతో వాయిదా పడినట్లు తెలిపారు.ముస్లిం మైనార్టీ మహిళలు ఒక తరగతిలో హాజరై మరో తరగతిలో హాజరు కావడానికి ప్రయత్నించడంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఎన్నికలు ఉద్రిక్త వాతావరణం నెలకొనడం గమనించిన కలకడ సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి ఎన్నిక వాయిదా వేసినట్లు తెలిపారు. **కలికిరి:** మండలంలోని 51ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాం తంగా జరిగినట్లు ఎఇఒ తెలిపారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్, ఎంపిడిఒ, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారు. **నిమ్మనపల్లి:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలు ఎంపి డిఒ షాలెట్, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సజావుగా సాగాయి. నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్ (తెలుగు) లో, ఆదర్శ పాఠశాలలో పాఠశాల కమిటీ చైర్మన్‌ను సభ్యుల ఆమోదం ద్వారా ఎన్నుకున్నట్లు ప్రధానో పాధ్యా యులు అంజాద్ అలీఖాన్, కెఎస్ఎన్ మూర్తిలు తెలిపారు. పాఠశాల చైర్మన్‌గా నాగులయ్యగారిపల్లెకు చెందిన ఎం.కృష్ణయ్యను, వైస్ చైర్మన్‌గా వెంకోజిగారి పల్లెకు చెందిన రెడ్డి శిల్పను, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గా జే.సోమశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా డి.పద్మజను ఎన్నుకున్నట్లు తెలిపారు. **రామాపురం**:మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికల్లో 56 పాఠశాలలో ఏకగ్రీవంగా కమిటీ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు ఎంఇఒ రామకృష్ణుడు తెలిపారు. మండలంలోని 13 పంచాయతీలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, హై స్కూల్లో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో 56 పాఠశాలలో ఏకగ్రీవంగా కమిటీ చైర్మన్ ఎన్నుకోగా, సరస్వతిపల్లి దళితవాడ ఎంపిపి స్కూల్, అగ్రహారం ఎంపిపి స్కూల్ ఎన్నిక ద్వారా కమిటీ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో పేరెంట్స్ స్కూల్ కమిటీ ఎన్నికపై ఏకాభిప్రాయం రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.**పుల్లంపేట:** మాజీ సర్పంచ్ రొంపిచర్ల మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికల్లో చైర్మన్‌గా సుంకర శివకుమారిని, వైస్ చైర్మన్‌గా గంటపార హరి తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి ముందుం టానని పేర్కొన్నారు. కార్యక్రమం లో కటికం పెంచలయ్య, గుత్తి నారాయణ, సుబ్రహ్మణ్యం, నరసింహ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గాలివీడు :** మండలంలోని 74 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలో 7 ఉన్నత పాఠశాలలో ఒకటి కెజిబివిలలో స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎంఇఒ నాగరాజు నూలువీడు గ్రామ పరిధిలో ఉన్న పాఠశాలలను పర్యవేక్షించారు. ఎంఇఒ-2 శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటప్రసాద్ పర్యవేక్షణలో ఎన్నికలు సజావుగా జరిగినట్లు ప్రధానో పాధ్యాయులు తెలిపారు. **బి.కొత్తకోట :** కురబలకోట మండలం అంగళ్లు స్థానిక చేనేతనగర్‌లో గల మహాత్మా జ్యోతిభాపులే గురుకుల పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో చైర్మన్లుగా బి.అరుణ,వైస్ చైర్మన్‌గా డి.నాగభూషణం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతగా జరిగినట్లు ఎంఇఒ తెలిపారు. ఒక మోడల్ స్కూలు ,ఒక కస్తూర్బా గాంధీ స్కూల్, 6 ఉన్నత పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలల్లో స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నిర్వహించామని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. ఎపిమోడల్ స్కూల్ నందు చైర్మన్ గా ఎస్. రియాజ్, వైస్ చైర్మన్ గా టి.కొండమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. **గుర్రంకొండ:** మండలంలోని అన్ని విద్యా కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల విద్యాధికారి సురేంద్ర తెలిపారు. మండలంలోని 48 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలలో ఎన్నికలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నాయని జగదీష్, మాజీ సర్పంచ్ నౌషాద్‌అహ్మద్, ఏళ్ళుట్ల మురళీ, మహత్మారెడ్డి, ఎంపిటిసి ప్రసాద్, చలమరెడ్డి, చంద్రబాబు, మేకల చలపతి, సుంకర శేఖర్, ప్రదీప్ చంద్, ఆనంద్, నారాయణ, అనిల్, వెంకట రమణ, రెడ్డెప్పరెడ్డి, సుధాకర్, రెడ్డి శేఖర్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో గురువారం ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు లు తెలిపారు. మండలంలోని 68 పాఠశాలలకు గాను 66 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. కన్యమడుగు ఉన్నత పాఠశాల, ఎద్దులవారికోట యూపీ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కాకపోవడంతో ఎన్నికలు వాయిదా పడినట్లు తెలిపారు. తంబళ్లపల్లి ప్రాథ మిక పాఠశాల చైర్మన్‌గా ఆనంద్, కస్తూర్బా బాలికల పాఠశాల చైర్మన్‌గా మల్లీశ్వరి, తంబళ్లపల్లి ఉన్నత పాఠశాల చైర్మన్‌గా శివకుమార్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.



పుల్లంపేట : స్కూల్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన శివకుమారి

సోలార్ ఫెన్సింగ్‌తో అడవిపందుల నుంచి రక్షణ

- రైతులు అవగాహన కలిగి ఉండాలి
- కెవికె సమన్వయకర్త డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

వివిధ పంటల్లో అడవి పందుల యాజమాన్యంపై రైతుల అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల శాస్త్రవేత్త డాక్టర్ వై. పీరుసాహెబ్ తెలిపారు. పంట నష్టం కలిగించే వన్య ప్రాణుల్లో అడవి పందులు ప్రధానమైనవని అయితే వన్యప్రాణుల సంరక్షణ చర్యల్లో భాగంగా, వీటిని చంపడం చట్టరీత్యా నేరమని అన్నారు.. అడవి పందులు పొలంలోకి చొరబడకుండా నివారణ చర్యలను చేపట్టడం ద్వారా వీటి బెడదను తగ్గించుకోవచ్చునని అన్నారు. వేరుశనగ, మొక్కజొన్న, వరి, చెరకు ఇతర పంటల్లో ఖరీఫ్, రబీ కాలంలో అడవి పందులు ఆశించి ఎక్కువ నష్టం కలుగచేస్తున్నాయని తెలిపారు. అడవి పందులు ఆశించటం వలన పంట విస్తీర్ణం కూడా తగ్గుతుందిని, అడవి పందుల ఉనికి ఎక్కువగా గడ్డి ప్రాంతాలు, అడవులు, కొండలు, నదీ పరివాహక, వ్యవసాయ ప్రాంతాల్లో ఉంటాయని అన్నారు. వీటికి వాసన గ్రహించే శక్తి ఎక్కువగా ఉంతుందని, వాసన ద్వారా పంటల్ని గుర్తించి అక్కడికి వచ్చి పంటల్ని నాశనం చేస్తాయని తెలిపారు. అడవి పందులు ఎక్కువగా వివిధ వ్యవసాయ పంటలు, దుంపలు, పురుగులు, పాములు, చిన్న జంతువులని తింటాయని తెలిపారు. వివిధ పంటల్లో అడవి పందులు ఎక్కువగా పరిపక్వ దశల్లో నష్టాన్ని కలుగ చేస్తాయని చెప్పారు. సాంప్రదాయ పద్ధతుల ద్వారా అడవి పందులను పొలాల్లోకి రాకుండా నివారించేందుకు పొలంచుట్టు పాత చీరలను కట్టడం, డ్రిప్ వైర్, జి.ఐ. వైర్, గ్రీన్ నెట్స్ ను ఉపయోగించి కొంత వరకు నియంత్రించవచ్చునని, కుళ్ళిన కోడిగుడ్లు ద్రావణం 20 మి. లీ ఒక లీటరు నీటిలో కలిపి పొలం చుట్టూ పిచికారి చేయడం, కొబ్బరి తాడును గంధకం, ఆముదం నూనె కలిపి పూసిన మిశ్రమంలో నానబెట్టి పంట పొలం చుట్టూ కట్టడం. వివిధ శబ్దాలు చేసే పరికరాలను పొలంలో అమర్చడం వలన పందుల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం వివిధ పద్ధతులలో అడవి పందుల నివారణలో సోలార్ ఫెన్సింగ్ సమర్ధవంతంగా ఉపయోగపడుతుందని ఈ మధ్య కాలంలో సోలార్ ఫెన్సింగ్ పద్ధతి సమర్ధవంతంగా పనిచేస్తూ ప్రాచుర్యంలోనికి వచ్చిందని, సోలార్ ఫెన్సింగ్ (బ్యాటరీ, సోలార్ పానెల్) తో పొలం చుట్టూ జిఐ వైరు ఒక అడుగు ఎత్తులో మూడు వరసల్లో ఏర్పాటు చేయడం ద్వారా అది సమర్ధవంతంగా అడవి పందుల ప్రవేశాన్ని నిరోధిస్తుందన్నారు. ఇందులో సోలార్ ప్లేట్ల ద్వారా 12 వోల్టులు విద్యుత్ ఉత్పత్తి చేయబడి స్వల్పమోతాదులో వైర్ల ద్వారా ప్రసారం జరిగి అడవి పందులకు షాక్ తగిలి పంట పొలాలవైపు రావడానికి జంకుతాయి, మిగతా పందులు ఏదో ఆపద వున్నదని భయపడి వెనుకకు వెళ్ళిపోతాయని చెప్పారు. ఈ పద్ధతి చాలా సమర్ధవంతంగా అడవి పందుల బెడదను తగ్గిస్తుందని, 5 ఎకరాలకు పదివేల నుంచి ఇరవై వేల ఖర్చుతో ఏర్పాటు చేసుకోవచ్చునని, జిల్లాలో కొంత మంది రైతులు సోలార్ ఫెన్సింగ్ ఉపయోగించడం ద్వారా అడవి పందుల నివారణ సమర్ధవంతంగా జరిగినట్లు తెలిపారు.



అడవి పందుల నుంచి పంట రక్షణకు ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్

బద్దిపల్లి, బడికాయలపల్లి రోడ్డు గుంతలమయం

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలమయమైన రోడ్డులోనే వెళుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలోని బద్దిపల్లి, బడికాయలపల్లి వెళ్లే రోడ్డు ఓబిశెట్టిపల్లి క్రాస్ వరకు పూర్తిగా దెబ్బతింది. తారురోడ్డు పూర్తి దెబ్బ తినడంతో ద్విచక్ర వాహనదారులు, రాష్ట్ర సరిహద్దు వరకు నడుస్తున్న ఆర్‌టిసి బస్సు, ఒక ప్రయివేట్ బస్సు రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా మారినట్లు ప్రజలు తెలిపారు. రోడ్లు, భవనాలశాఖ అధికారులు ఈ దుస్థితిపై స్పందించి తమ గ్రామాలకు ఉన్న ఒక్క బస్సును కూడా ఆగిపోకుండా చూడాలని కోరుకుంటున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలను తమ పిల్లలకి ఇవ్వాలంటే భయమేస్తుందని, రోడ్డు పరిస్థితి చాలా అధ్వానంగా ఉండడంతో కనీసం ద్విచక్ర వాహనాలు వచ్చే తమ పిల్లలు ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురి కాకుండా, సురక్షితంగా వచ్చేందుకు వీలుగా కనీసం మరమ్మతులను చేయించాలని ప్రజలు కోరారు. ఈ మార్గం గుండా అధికారులు వచ్చి పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అద్వానస్థితికి చేరుకుంటుందన్నారు. దృష్టిలో ఉంచుకొని బద్దిపల్లి, బడికాయలపల్లి రోడ్డును పూర్తిస్థాయిలో వేసి వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు.

వినేష్ ఫోగట్‌పై అనర్హత ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

2024 పారిస్ ఒలింపిక్స్ నుండి వినేష్ ఫోగట్‌ను ఏకపక్ష, అన్యాయంగా అనర్హులుగా ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ తెలిపారు. ఆ మేరకు గురువారం డివైఎఫ్ఐ పొద్దుటూరు పట్టణ కార్యాలయంలో నిరసన వక్తం చేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజ్, నాయకులు విశ్వనాథ్ మాట్లాడుతూ ఇది భారతీయ క్రీడలకు ఎదురుదెబ్బ మాత్రమే కాదని, ఫెయిర్ ప్లే, స్పిరిట్‌పై కఠోరమైన దాడిగా అభివర్ణించారు. వినేష్ ఫోగట్ స్థితిస్థాపకత, ధైర్యం, శ్రేష్ఠత యొక్క తిరుగులేని అన్వేషణకు చిహ్నమన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో పాతుకుపోయిన అస్వస్థతను బహిర్గతం చేసిన అధ్యాయం, మాజీ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ అణచివేత పాలనకు వ్యతిరేకంగా ఆమె ప్రయాణం చారిత్రాత్మక పోరాటంతో ముడిపడి ఉందన్నారు. వినేష్ అనర్హత చుట్టూ ఉన్న పరిస్థితులు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాము, చినబాబు, రవికుమార్, రమేష్, సతీష్, నాయకులు రాజు, సోమేష్, గుణ, నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : రాయలసీమ రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి మంత్రులను కోరారు. అమరావతి సచివాలయంలోని మంత్రుల ఛాంబర్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డిని, మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందించారు.

అన్నీ పులివెందులకే అనడం సరికాదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): కడప పార్లమెంటు పరిధిలో కేవలం పులివెందుల ఒక్కటే ఉన్నట్లు చూస్తున్నారని, మిగతా నియోజకవర్గాల గురించి ఆలోచన చేయాలని, తాజాగా ప్రభుత్వ సైనిక పాఠశాల కూడా పులివెందులకు కావాలని ఎంపీ అవినాష్‌రెడ్డి కేంద్రాన్ని కోరడం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందులలో పలు ప్రముఖ సంస్థలున్నాయని తెలిపారు. ప్రొద్దుటూరుకు దక్కాల్సిన మెడికల్ కాలేజ్ కూడా పులివెందులకు తరలించారన్నారు. ఇప్పుడు సైనిక్ స్కూల్ కూడా అక్కడే ఏర్పాటు చేయాలనడం సరికా దన్నారు. మైదుకూరు, బద్వేల్ వంటి వెనుక బడిన ప్రాంతాలను ఎంపీ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారని ఆరోపించారు.



నాగుల ప్రతిష్టాపనలో మార్పురీ సుధాకర్‌నాయుడు

ఘనంగా నాగుల ప్రతిష్టాపన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని శ్రీయోగ బోగేశ్వర స్వామి ఆలయం (మడికయ్యల శివాలయం)లో నాగులచవితిని పురష్కరించుకొని గురువారం మంత్రోఛ్చారణల మధ్య సాంప్రదాయ బద్దంగా నాగుల ప్రతిష్టాపనను అత్యంత వైభవంగా నిర్వహించారు. మార్పురీ సుధాకర్ నాయుడు కుటుంబ సభ్యులు నాగుల విగ్రహాలను ఆలయానికి వితరణగా అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరశర్మ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెద్ద ఎత్తున భక్తాదులు హాజరు కావడం ఎంతో విశిష్టత కల్గిన నాగుల ప్రతిష్ఠను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ నాయుడు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న మడికయ్యల శివాలయంలో నాగుల విగ్రహాలను ప్రతిష్టించడం శుభపరిణామం అన్నారు. నమ్మకం, భక్తి భావంతో ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నాగుల విగ్రహాలను ప్రతిష్టంచడంతో ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో శ్రీలత, డాక్టర్ మురళీధర్, డాక్టర్ శ్రీదేవి, విజయశ్రీ, భక్తాదులు పాల్గొన్నారు.



భద్రపరిచేందుకు సిద్ధంగా ఉన్న రికార్డులు

రికార్డులను భద్రపరుస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు, డికెటి, ఇంటి పట్టాలు, చుక్కల భూములు ,అసైన్డ్ భూములు, ఆర్ఎస్ఆర్, ఎన్నో సంవత్సరాల నుంచి రెవెన్యూశాఖ దస్త్రాలన్నిటినీ తహశీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదిలో ఉన్నాయి. వాటిని భద్రం చేయడానికి రికార్డులను ఆయా శాఖల వారీగా గ్రామాల వారీగా సంవత్సరాల వారీగా పట్టాలను డాక్యుమెంటల్ అన్నిటిని రికార్డు రూములో భద్రపరిచాలని ఉద్దేశంతో రెవెన్యూ అధికారులు కృషి చేస్తున్నారు. విఆర్ఎలు గ్రామాలకు సంబంధించిన ఫైళ్లను రికార్డ్ రూముల్లో భద్రం చేస్తున్నారు.

వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి : ఎంపిజె

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) నాయకులు కోరారు. ఆ మేరకు వారు గురువారం స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో ప్లకార్డులు చేబూని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిజె షేక్ సలీం, ఇన్సాఫ్ మాజీ కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ముస్లింల భూ యాజమాన్య హక్కులను హరించేందుకు ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చే కుట్రలో భాగంగా వక్ఫ్ బోర్డు ఆస్తులను సైతం కాజేయడానికి ఏకంగా 40 సవ రణలు చేసి బిల్లును పార్లమెంటు, రాజ్యసభలోనూ ప్రవేశపెట్టి ఆమో దించుకోవాలని కుట్రలు పన్నుతోందన్నారు. ఈ బిల్లును ఎన్‌డిఎ ప్రభుత్వంలోని భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన అధినేతలు పార్లమెంటులో పెట్టకుండా అడ్డుకోవాలని కోరారు. ఎంపిజె జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుశేన్ బాషా, కార్యదర్శి మహమ్మద్ రఫి, మీడియా కార్యదర్శి అస్లాం, కార్య కర్తలు పాల్గొన్నారు.

దర్జాగా కారులో వచ్చి పట్టుచీరలు కాజేసిన మహిళలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో కొంతమంది మహిళలు ఒక వస్త్ర దుకాణంలోకి కొనుగోలుదారులుగా వెళ్లి తమ చేతివాటం చూపించారు. ఆర్స్ కళాశాల రోడ్డులో ఉన్న ఒక వస్త్ర దుకాణంలోకి ఆరుమంది మహిళలు ఒక ఇన్నోవా వాహనంలో దర్జాగా వచ్చారు. ఖరీదైన 10 పట్టు చీరలను దొంగలించారు. వస్త్ర దుకాణంలో పనిచేసే సిబ్బందిని మాటల్లో పెట్టి ఖరీదైన పట్టు చీరలను చాలా చాకచక్యంగా దొంగలించారు. పట్టు చీరలు తక్కువగా ఉండడంతో యజమానికి అనుమానం వచ్చింది. ఈ దొంగతనం వ్యవహారం అంతా షాపులో ఉన్న సీసీ పుటేజీలో రికార్డు అయింది. మహిళలు వెళ్లిన తర్వాత షాపు యజమాని పట్టుచీరలను చూసుకుంటే చీరలు తక్కువగా కనిపించడంతో సీసీ పుటేజీలను పరిశీలించగా ఇన్నోవా వాహనంలో వచ్చిన మహిళలు ఎంచక్కా దొంగతనం చేసి వెళ్లిపోయారని గమనించారు. పోలీసుల కేసు నమోదు చేసి మహిళల కోసం గాలిస్తున్నారు.

క్రైం కార్నర్

నకిలీ బంగారంతో బురిడీ కొట్టించిన జంట

ప్రజాశక్తి-బి.కొత్తకోట



నకిలీ బంగారాన్ని చూపుతున్న ఈశ్వరమ్మ

నకిలీ బంగారంతో ఓ జంట మహిళను బురిడీ కొట్టించిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే నక్క రాజుపల్లి క్రాస్‌లో టీస్టాల్ నిర్వహిస్తున్న ఈశ్వరమ్మ వద్దకు వచ్చిన ఒక జంట మా వద్ద బంగారు వడ్డానం ఉందని చెప్పి కావాలంటే బంగారమో, కాదోనని పరీక్ష చేయించి, నిర్ధారించుకున్న తర్వాతే డబ్బులు ఇమ్మని చెప్పారు. వడ్డానంలోని మొదటి భాగం కొంచెం కత్తిరించి ఇచ్చి బంగారం కాదని నిర్ధారించుకున్న తర్వాతే డబ్బులు ఇవ్వమని నమ్మించారు. వారు కత్తిరించి ఇచ్చిన బంగారాన్ని బంగారు పనిచేసే కమసలి దగ్గరికి వెళ్లి పరీక్షించిన తర్వాత అతను బంగారమని చెప్పడంతో వారికి డబ్బు ముట్టచెప్పి వడ్డానాన్ని తీసుకొని మరల బంగారు పనిచేసే కమసల దగ్గరికి తీసుకొచ్చింది.మరల పరీక్షించిన కమసలి ఇది బంగారమే కాదని చెప్పడంతో ఆమె ఆశ్చర్యపోయింది.మొదట ఇచ్చింది బంగారమే కానీ ఇప్పుడు నువ్వు తెచ్చింది బంగారం కాదని చెప్పడంతో ఆ మహిళ మోసపోయానని గ్రహించి పోలీసు వారిని ఆశ్రయించింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు సిఐ సూర్యనారాయణ తెలిపారు. ఎవరైనా అపరిచత వ్యక్తులు వచ్చి ఇలా మోసాలకు పాల్పడతారని, అటువంటి వారి పట్ల ప్రజల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

బాలికను గాయపరిచిన కేసులో ఏడేళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బాలికను గాయపరిచిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ చిత్తూరు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి ఎన్.శాంతి గురువారం తీర్పు చెప్పారు. మదనపల్లె టూటౌన్ సిఐ యువరాజు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, చంద్ర కాలనీకి చెందిన పుల్ల రమేష్ అలియాస్ తిరుపతి (41) ఇదే ప్రాంతానికి చెందిన మూడేళ్ల మైనర్ బాలికను గాయపరిచిన కేసులో 2017లో సిఐ హనుమంత్ నాయక్ ముద్దాయిని అరెస్టు చేసి దర్యాప్తు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ ఫిర్యాది తరఫున వాదించారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ముద్దాయి పుల్ల రమేష్ అలియాస్ తిరుపతిపై నేరారోపణ రుజువు కావడంతో ఏడేళ్లు జైలు శిక్ష, రూ.1000లు జరిమానా విధించారు.